

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -నెల్లూరు :విద్యార్థులందరూ పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా ఉంటే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలుగుతారని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి నిర్వ హించిన పరీక్షా పే చర్చ- 8వ ఎడిషన్ కార్యక్రమాన్ని వీడియో ప్రసారం చేయగా, స్థానిక ఈఎస్ఆర్ఎం నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. కలెక్టర్ విద్యా ర్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ సూచించిన విధంగా విద్యార్థులందరూ ఒత్తిడితో కాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాల న్నారు. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా విద్యార్థుల కోసం నిర్వ హించిన పరీక్ష పే చర్చ కార్యక్రమం విద్యార్థుల్లో మరింత స్ఫూర్తి నింపుతుందన్నారు. డిఇవో బాలాజీరావు, సమగ్రశిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య, హెచ్ఎం శివరామప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్నకు 'మద్దతు' దొరికేనా..!

ఉదయగిరిలో కలాల్లో అమ్ముకుంటున్న ధాన్యం పరిశీలిస్తున్న రైతు నాయకులు (ఫైల్)

రైతులు పండించిన పంట చేతికొస్తుంది. పండుగకు ముందే ఇంటికి చేరాల్సిన ధాన్యం కాస్త ఆసల్యం కావడంతో ఇప్పుడు కోతకు సిద్ధమవు తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటాం, మద్దతు ధర ప్రకటిస్తామని చెబుతోన్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. గతంలో జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్‌బికె, సివిల్ సప్లయ్, ఎఫ్‌సిఐ కేంద్రాల ద్వార పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసేవారు. గత నాలుగేళ్ల నుంచి ఇది పడకేసింది. నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి రేషన్‌బియ్యం, హాస్టళ్లు ఇతర అవసరాలకు ఉపయోగపడే లెవీని ప్రభుత్వం స్వీకరించడం లేదు. గత ఏడాది జులై నుంచి కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులను నిలిపేసింది. బియ్యం ధరలు మార్కెట్‌లో రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. ధాన్యం ధరలు రోజు రోజుకు పడి పోతున్నాయి. ఈ రహస్యం అర్థంకాక రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేయడానికి దళారులు అప్పుడే కల్లాలో వాలిపోతున్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టకుంటే రైతులు మరింత అన్యాయానికి గురికావడం తప్పదు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రైతులు పండించిన పంట చేతికొస్తుంది. ఇప్పటికే మెట్ట ప్రాంత రైతులు ఉదయగిరి, సీతారాపురం, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు వంటి ప్రాంతాల్లో ఈ ఏడాది ఎర్ర జగిత్యాల (మసూర) రకం సాగు చేశారు. ప్రతేడాది మంచి ధర వస్తుండడంతో ఈ ఏడాది దానిని రైతులు పెద్ద ఎత్తున సాగుచేశారు. ఈ మండలాల్లో కనీసం 10 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇది కాకుండా జిల్లా వ్యాపితంగా ఏగ్రేడ్ రకం కెఎన్ఎం, సుఫర్ లెస్, బిపిటి తోపాటు 1001 రకం సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పుడు కోతలు మొదలు పెట్టారు. మార్చి నాటికి పూర్తి కానున్నాయి. ఎకరా సాగుచేయడానికి సుమారుగా రూ.26,500 ఖర్చు చేశారు. వరిసాగు రైతుకు రోజు రోజుకు భారంగా మారుతోంది. ప్రతీది భారీగా ధరలు పెరిగిపోతున్నాయి. పండించిన పంటకు మాత్రం మద్దతు ధర దక్కడం లేదు.. ఇందుకు ప్రధాన కారణం తెగుళ్లు,. గతంలో ఎకరానికి 4 పుట్లు వస్తుండగా, ఈ ఏడాది 2.5 పుట్లు మాత్రమే దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చిన ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి స్థితి వచ్చిందని రైతులంటున్నారు. దీనికి తోడు సాగు కష్టంగా మారింది. కూలీల రేట్లు, డీజిల్ ధరలు, పెరుగుదలతోపాటు, మద్దతు ధర లభించడం లేదు. ఎకరా పొలం దుక్కిదున్నడానికి రూ.7000, నాట్లు వేయడానికి రూ.7000, డిఎపి బస్తా రూ.1700, యూరియా రెండు బస్తాలు రూ.700, స్ప్రేర్ మందు రూ.1000, కలుపుకు రూ.2500, వరి కోత కు రూ.3500 ఖర్చు చేస్తున్నారు. ఎకరానికి రూ.26,200 పెట్టుబడి పెడుతున్నారు. యంత్రాలు, లేదా కూలీలతో చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతేడాది ఆర్‌బికెలు, డిఆర్‌డిఎ, సివిల్‌సప్లయ్, ఎఫ్‌సిఐ ద్వార ధాన్యం కొనుగోలు చేసేది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి అందుకు అనుగుణంగా కొనుగోలు చేసేవారు. వారం పది రోజుల్లో తమ ఖాతాల్లో నగదు జమ అయ్యేవి. రైతులు ప్రభుత్వం తమ ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆశగా ఎదురుచూసేవారు. ఒక వేళ ప్రభుత్వం ధానం కొనుగోలు చేయకపోతే దళారులు, మిల్లర్లు కల్లాలో పడి తమకు ఇష్టం వచ్చిన ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారు.

ప్రభుత్వం మాట నిలబెట్టుకునేనా..!

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సుమారు మూడు వందల ఆర్‌బికె కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ఇటీవల జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రకటించారు. గతంలో ప్రభుత్వమే పెద్ద ఎత్తున కొనుగోలు చేసేది. లెవీ కోసం మిల్లర్లకు ఆదేశాలిచ్చేది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల నుండి లెవీ బియ్యాన్ని జిల్లాలో కొనుగోలు చేయడం లేదు. శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి రేషన్ షాపులు, హాస్టళ్లకు తెచ్చుకుంటుంది. ఈ విధానాన్ని పక్కన పెట్టి ఇక్కడే ధాన్యం కొనుగోలు చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం పుట్టి రూ.19720 ప్రకటించింది. ప్రస్తుతం జిల్లా వ్యాపితంగా మిల్లర్లు అప్పుడే కలాల్లో వాలిపోయారు. పుట్టి రూ.17 వేలకు కొనుగోలు చేసి, దళారులు, రైసు మిల్లుల్లో నిల్వచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే బ్యాంకు ఖాతాల్లో నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా జరగకపోవడంతో 2017 నుంచి 2023 వరకు జిల్లాలో సుమారు రూ.100 కోట్లు దుర్వినియోగమైంది. ఇప్పటికీ ఆ లెక్కలు తేలలేదు. రైతుల పరిస్థితులు అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంకు సంబంధించి ఈనెల 22 న ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పి. శ్రీరాములు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. మద్దతు ధర చెల్లించాలి. కార్డులు లేకపోయినా ఈ క్రాప్ నమోదు చేసుకొని రైతులు అమ్ముకోడానికి ఏర్పాటు చేయాలి. కొనుగోలు కేంద్రాల నుంచి రైతుల మిల్లర్లకు ధాన్యం తీసు కొని వెళ్లి ఇచ్చే విధానం మార్చాలి. తేమ, తరుగు, సాకు చెప్పి తరుగు ఎక్కువ తీసుకోకుండా నిఘా పెట్టాలి. రైతులకు గోతాములు అందుబాటులో ఉంచాలి. కొనుగోలు కేంద్రాల వివరాలు సచివాలయాల్లో ప్రకటించి, రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలి.

'పది'పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి -నెల్లూరు

మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారి జె. విజయభాస్కర్ రావు సంబంధిత అధికారులకు సూచించారు.వచ్చే నెల 17 నుండి 31 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులుతో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం డి ఆర్ఓ ఛాంబర్‌లో నిర్వ హించారు.ఉదయం 9:30 నుండి 12:45 వరకు నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి బాలాజీ రావు వివరించారు. మొత్తం 1622 మంది ఇన్విజిలేటర్లును నియమించా మన్నారు. పరీక్షల నిర్వహణ కు జిల్లాలో 174 కేంద్రా లను ఏర్పాటు చేసామని, వీటిలో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు. డి ఆర్ ఓ ఉదయభాస్కర్ రావు మాట్లాడుతూ, ఆయా పరీక్షాకేంద్రాల వద్ద సరైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఒకేషనల్ విద్యా అధికారి మధుబాబు తో పాటు పోలీస్, ఆర్ టి సి, విద్యుత్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి వ్యక్తిగత శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సిఇవో విద్యారమ, డ్వామా పిడి గంగా భవాని, డిపిఒ శ్రీధర్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాల యంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ నందన్ అర్జీలు స్వీకరించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నెల్లూరు : నగరవ్యాప్తంగా ఉన్న పాత డంపర్ బిన్స్ స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ పనులను మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక బట్వాడి పాలెం సెంటర్, వెహికల్ షెడ్, టిబి హాస్పిటల్ వెహికల్ షెడ్, బారా షహీద్ దర్గా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వెహికల్ షెడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం డిఈఈ. రఘురాం, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం అన్నిశాఖల అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం, సామాజిక మరుగుదొడ్ల భవన నిర్మాణాలను పూర్తిచేయడంపై అధికారులు ప్రత్యేక దష్టిపెట్టాలన్నారు. జెడ్‌పి సిఇఒ విద్యా రమ, డ్వామా పీడీ గంగా భవాని, డిపిఒ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకట రమణ ఉన్నారు.

రిజిస్ట్రేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొంటేనే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వ్యవ సాయశాఖ సహాయ సంచాలకులు ఎ. రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం తోటపల్లిగూడూరు మండలం ఇసుకపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో భూ ఆధార్ ఫా ర్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం జరిగింది. ఎంఎఒ వివి శిరీష రా ణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ వ్యవ సాయ సంచాలకుల రాజకుమార్ పాల్గొన్నారు. వ్యవసాయ సహాయ కులు ఎస్.డి. షర్మిల, సుమంత్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : గ్రామీణాభివద్ధిని అన్ని రంగాల్లో పటిష్టం చేస్తూ అభివద్ధి వైపు నడిపిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఎంఎల్ఎ ఇంటూరి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలో రూ 4.50 కోట్లతో తారు రోడ్ల నిర్మాణానికి ఎంఎల్ఎ భూమిపూజ చేశారు. తొలుత మండలంలోని లింగపాలెం నుంచి రోళ్ల పాడుకు రూ 1.5 కోట్లతో భూమి పూజ చేసి మాట్లాడారు. 167బి జాతీయ రహదారికి అనుసంధానంగా కొండసముద్రం కొత్తూరు వరకు రూ 1.5 కోట్లతో, అనంతరం పోకూరు శివాలయం నుండి శింగమనేనిపల్లికి రూ 1.5 కోట్లతో ఈ మూడు తారురోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ చిడిపోతు సురేష్ బాబు, ఎంపీడీఓ కె నరేంద్ర దేవ్, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఘట్టమనేని వీరమ్మ, టిడిపి నాయకులు ఉన్నారు.

వైద్యులకు అభినందనలు

ప్రజాశక్తి -నెల్లూరు : కావలి డివిజన్ పరిధిలోని మోచర్లయిఅ చెందిన నిండు గర్భిణి పారాబత్తిన రజిని (25) కి సకాలంలో జిజిహెచ్ వైద్యులు సోమవారం ఆపరేషన్ చేసి తల్లి బిడ్డలను క్షేమంగా కాపాడారు. ర్భిణీ రజనీకి నెలలు నిండడంతో పాటు జ్వరం, నెప్పులతో బాధపడుతూ ప్లేట్ లెట్స్ పడిపోవడంతో కావలి ఏరియా హాస్పిటల్ కు తీసుకుని వెళ్లారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో జిజిహెచ్‌కు పంపారు. జిజిహెచ్ వైద్యులు డాక్టర్ గీతా లక్ష్మీ పర్య వేక్షణలో రజినీని పరీక్షించగా ప్లేట్ లెట్స్ దారుణంగా పడిపోయి 40 వేలు మాత్రమే ఉండడంతో అప్పటిక ప్పుడు సర్జరీ అవసరమని నిర్ధారించారు. గర్భిణీకి అవసరమైన బి పాజిటివ్ రక్త కణాలను తీసుకొని వచ్చి ఆపరేషన్ విజయవంతం చేశారు. అనంతరం హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సుశీల్ తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని డాక్టర్లతో పాటు వెల్లడించారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ కో-ఆర్డి నేటర్ మడపర్తి శ్రీనివాసులు, హాస్పిటల్ డైరెక్టర్ మొగ రాల సురేష్, బ్రహ్మారెడ్డి ఆపరేషన్ విజయవంతం చేసిన డాక్టర్లకు అభినందనలు తెలిపారు.

అక్రమ చొరబాటుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఇంట్లోకి అక్రమంగా చొరబడినట్లు ఈ నెల 9వ తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంకటాచలం మండలం కసుమూరు గ్రామానికి చెందిన దేవర్ల లీలా అనే మహిళ తోటపల్లిగూడూరు మండలం పాత కోడూరు గ్రామంలో వున్న తన ఇంట్లోకి అక్రమంగా చొరబడినట్లు కుళ్లూరు శేషయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, నగలు, నగదు దోచుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని శేషయ్య పోలీ సుల కు విజ్ఞప్తి చేశారు.

ఉచిత నేత్ర వైద్య సేవలు

ప్రజాశక్తి -గుడ్లూరు : స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో ఏర్పాటుచేసిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో నిరంతరం ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంస్థ ఇన్‌ఛార్జి పద్మ సోమవారం తెలిపారు. గుడ్లూరులో ఉచితనేత్ర వైద్యశాల ఏర్పాటు చేసి ఏడాది పూర్తయినందున కంటి జబ్బులకు సంబంధించి సౌకర్యాల మెరుగు కోసం నూతన పరికరాలు అందుబాటులోకి తెచ్చిన సందర్భంగా ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కంటి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు : నేషనల్ హైవే 167 బి రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్నటువంటి లైన్ ను తొలగించే క్రమంలో ఓగూరు వద్ద ఉన్నటువంటి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 09:30 నిమిషాల నుండి మధ్యాహ్నం 03:30 నిమిషాల వరకు సబ్‌స్టేషన్ కి విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు కందుకూరు రూరల్ అసిస్టెంట్ ఇంజనీర్ టివి నరసిహం తెలిపారు. ఓగూరు, పలుకూరు, పంట వారి పాలెం,పత్తిపాటి వారి పాలెం, రెడ్డిపాలెం, వెంకన్నపాలెం,ఉన్నం వారి పాలెం, గని గుంట,దివి వారి పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం, వ.కా.సం, కౌలు రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వరి ధాన్యానికి మద్దతు ధర ఇచ్చే వరకు పోరాటం సాగుతుందని వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంగళం పుల్లయ్య పేర్కొన్నారు. . ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర (పుట్టి కి)19,720 రైతులకు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలు వేంటనే ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తోటపల్లిగూడూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన జరిగింది. పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా, రైతు సంఘం మండల కార్యదర్శి వేగూరు శంకరయ్యమాట్లాడారు. రైతులకు క్వింటాల్ ధాన్యం కి సుమారు 3000 రూపాయలు ఖర్చు అవుతుం దన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మాత్రం మద్దతు ధర తగ్గించడం విచారకరమన్నారు. కలెక్టర్‌నే చొరవ తీసుకొని జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు బండి శౌరి, మోచార్ల రాధయ్య, ఉంద్రాళ్ల శీనయ్య, నరకూరు సెంటర్ ఆటో యూనియన్ కార్యదర్శి ఎ. గోపి, ట్రెజరర్ శివ, ప్రభావతమ్మ, చిన్నబ్బయ్య, వీరయ్య పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం, , వ్యవసాయ శాఖ అధికారి శిరీష రాణిలకు వినతిపత్రాలు అందజేశారు

ప్రజాశక్తి -గుడ్లూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని రైతు సంఘం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం దగ్గర సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కింటా ధాన్యానికి 2,320లో ప్రకటించిందని, దీనివల్ల రైతులకి ఒరిగేది ఏమీ లేదని అన్నారు కింటా ధాన్యం పండించడానికి రైతుకి మూడు వేల రూపాయలు ఖర్చు అవుతుం దన్నారు. జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంట ఖర్చుతో పాటు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు ఇవ్వాలని రైతు సంఘం కోరుతుందన్నారు. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు రైతు సంఘం మండల కార్యదర్శి కె వెంకయ్య డ్రామా కష్ణయ్య రైతు సంఘం అధ్యక్షులు ఒరిజినల్ సిద్దయ్య గుత్తి మల్లికార్జున పూసల పాలయ్య రైతులు చిన్న పాపయ్య కామంచి జై చంద్ర కె నారాయణ శ్రీనివాసులు ఉన్నారు.

గుడ్లూరులో..

15న 'స్వచ్ఛ కందుకూరుకు' శ్రీకారం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 15నకందుకూరులో జరిగే స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు హాజరవుతారని, స్వచ్ఛ కందుకూరుకి ఆయన శ్రీకారం చుట్టబోతున్నారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరాం పేర్కొన్నారు. ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు కోరిక మేరకు కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌తపాటు దూబగుంట గ్రామ సమీపాన ఏర్పాటు చేసిన వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను టిడిపి సీనియర్ నాయకులు దివి శివరాం, ఉన్నతాధికారులతో కలిసి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సోమవారం సందర్శించారు. అనంతరం పట్టాభిరామ్ మాట్లాడుతూ 15న జరిగే స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ కందుకూరు కార్యక్రమానికి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టబోతున్నా రన్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో ఉన్న ప్రధాన సమస్యలపై స్థానిక శాసనసభ్యులతో కలిసి ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారు. 26 వేల టన్నుల చెత్త ఉన్న డంపింగ్ యార్డ్ నీ కందుకూరులోనే జనావాసాలు ఉన్న చోట ఏర్పాటు చేయడం దారుణమన్నారు. వంద రోజుల్లోనే ఈ డంపింగ్ యార్డ్ నీ ఖాళీ చేసి ఆ ప్రదేశాన్ని పచ్చని పబ్లిక్ పార్క్ గా మార్చి ఇక్కడి ప్రజలకి అందిస్తామని పట్టాభి రామ్ తెలిపారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్లే డంపింగ్ యార్డ్ ఈ దుస్థితిలో ఉందని, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా డంపింగ్ యార్డ్ ను ఇక్కడి నుంచి తరలించి సుదూర ఏర్పాటు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణంలోని దూబగుంట గ్రామం వద్ద వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, కంద ుకూరు మునిసిపల్ కమీషనర్ కొర్రపాటి అనూష, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఉన్నారు.

మెరుగైన ఆరోగ్యం కోసం

నులిపురుగుల నివారణ మాత్రలు : కలెక్టర్

నెల్లూరు : విద్యార్థులందరూ ఆరోగ్య వంతంగా ఉండేందుకు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపు నిచ్చారు. సోమవారం నగరంలోని మూలాపేట ఈఎస ఆర్ఎం నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణదినం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల ఆవశ్యకతపై కలెక్టర్ వివరించారు. డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, డిఇవో బాలాజీరావు, సమగ్రశిక్ష ఎపిసి వెంకట సుబ్బయ్య, హెచ్ఎం శివరామప్రసాద్, స్థానిక వైద్యాధికారి ప్రతిమారెడ్డి, ఆశా,ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంగళరావునగర్, నగర పాలక ఉన్నత పాఠశాల (తాతయ్యబిడి) నందు జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా లిఆల్బెండజోల్‌లి మాత్రల పంపిణీ చేశారు. యు.పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్.పి.రీనా భారతి మాట్లాడారు.

నెల్లూరులో..

ప్రజాశక్తి - లింగసముద్రం : మండల పరిధిలోని 45 అంగన్వాడీ కేంద్రాలు, 47 ప్రభుత్వ పాఠశాలల్లో,5 ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. మొత్తం 5217 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలు పంపిణీ చేశారు. 97 శాతమంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రమేష్ ,డాక్టర్ అనురాధ,సిహెచ్ఓ శ్రీనివాసులు పర్యవేక్షకురాలు క్షత్రియ కుమారి,మహబూబ్ బాషా పర్యవేక్షకుడు మండల పరిధిలోని అందరూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.సిబ్బందికి డాక్టర్ రమేష్ అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-కందుకూరు : టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు, సిబ్బందికి పంపిణీ చేశారు.కళాశాలలో నిర్వహించిన నులిపురుగుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. రవికుమార్ పాల్గొని మాట్లాడారు. ఇంకా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోట సుధాకర్ రావు మాత్రల ఆవశ్యకతను వివరించారు. ఏరియా హాస్పిటల్ నుండి వచ్చిన ఏ.ఎన్.ఎమ్. కల్యాణి విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి మాత్రలు పంపిణీ చేశారు.

విద్యుత్ విజిలెన్సు అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు

మున్సిపాలిటీ పరిధిలో సోమవారం విద్యుత్ విజిలెన్సు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. హైమావతి, కందుకూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లెల నాగేశ్వర రావు ఆధ్వర్యములో ఆకస్మిక తనిఖీలు జరిగాయి. రూరల్స్ సెక్షన్ పరిధిలో 36 బందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. పలు వాహనదారులకు జరిమానా విధించారు. కందుకూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఆపరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ , ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్స్ ,సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

గెస్ట్ హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని దివివారిపాలెం రోడ్డులో ఉన్నం భాస్కరరావు నూతనంగా నిర్మించిన బి.ఆర్.గెస్ట్ ఇన్ గెస్ట్ హౌస్ ను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు,మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరామ్ సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులు ఉన్నం భాస్కర్ ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును సన్మానించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఘట్టమనేని హరిబాబు, ఉన్నంవీరస్వామి, మర్రిపూడి శ్రీనివాసరావు, బత్తిన మాల్యాద్రి ఉన్నారు.

గుండెపోటు వచ్చినప్పుడు వేసే

ఖరీదైన ఇంజెక్షన్ కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు : మారుతూ ఉన్న జీవన శైలి ఆహారపు అలవాట్లు కారణంగా వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులు అధికంగా నమోదు అవుతున్నాయని, కందుకూరు ప్రభుత్వ ఏరి వైద్యశాల డాక్టర్ తులసీ రామ్ తెలిపారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిన ఒక గంట లోపు టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఇవ్వగలిగితే రోగి ప్రాణాన్ని కాపాడవచ్చునని తెలిపారు. దీని ఖరీదు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకూ ఉంటుందన్నారు. ఇంత ఖరీదైన ఇంజెక్షన్ ను పేదలు కొను గోలు చేయలేక ప్రాణాలు విడుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఇంజెక్షన్ ను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. అటు వంటి ఇంజక్షన్ ఇప్పుడు కందుకూరు ప్రభుత్వ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉందని డాక్టర్ తులసిరామ్ తెలిపారు. ఈ టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఇచ్చి కందుకూరు ఏరియా హాస్పిటల్ లో ఇప్పటివరకు పదిమంది పైగా ప్రాణాలు కాపాడడం జరిగిందని డాక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ కోరారు.

డాక్టర్ తులసీరామ్

కందుకూరులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కందుకూరు : ఒంగోలులోని రెడ్ క్రాస్ రక్త నిధిలో రక్త నిల్వలు బాగా తక్కువగా ఉన్నందున వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశ్యంతో సోమవారం కందుకూరు లో రక్త దాతల వాట్స్ ఆప్ సమూహము ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం జరిగింది. కందుకూరు డిఎస్పి సిహెచ్‌వి బాల సుబ్రహ్మణ్యం రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. ఒంగోలు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారు రక్త సేకరణ చేశారు.కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ రక్త దానం చేయడం అనేది యువత ఓ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ ప్రకతి వ్యవసాయ శాస్త్ర వేత్త నల్లూరి ప్రసాద్ దంపతులు రక్త దానం చేశారు.కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు,రక్త దాతల వాట్స్ ఆప్ గ్రూప్ అడ్మిన్ పూరిపర్తి శ్రీనివాస రావు, విలేకరి బొజ్జా చంద్ర మోహన్,కనపర్తి మల్లికార్జున (కానిస్టేబుల్), ఓరుగంటి రమేష్ , చన్నా రంగనాయకులు గుప్తా ఉన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్పి బాల సుబ్రమణ్యం

డిగ్రీ ఫలితాలు వెల్లడి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం డిగ్రీ ఫలితాలను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు , స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె. పట్టాభి రామ్ చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. కళాశాల స్వయం ప్రతిపత్తి అయిన తర్వాత విడుదల చేసిన మొట్టమొదటి ఫలితాలలో 83.40శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు సాధించడం సంతోషం అని చెప్పి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి విద్యార్థులను, కళాశాల సిబ్బందిని అభి నందించారు.. ఈ ఫలితాల్లో బిఎ- 80.95, బిఎస్సీ- 91.94, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 77.57 ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్ ,కంట్రోలర్ ఎగ్జామ్స్ కె. శ్రీనివాసులు తెలిపారు.లో అసిస్టెంట్ కంట్రోలర్ ఎగ్జామ్స్ డాక్టర్ జె. హను మంతరావు, క్లర్కు పి. రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఫలితాలు త్వరితగతిన అందించడానికి సహకరించిన వారందరికీ ప్రిన్సిపాల్ రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



డిగ్రీ ఫలితాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి, తదితరులు

పలుచోట్ల నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

వరికుంటపాడు:మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్నటువంటి కిశోర బాలలకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను వైద్యశాఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని కరిష్మా మాట్లాడుతూ మండలంలో 3635 మంది కిశోర్ బాలలు ఉన్నారని వారందరికీ ఒక్కొక్క మాత్ర వేసుకునే లాగా పంపిణీ చేశామన్నారు. ఈ మాత్ర వేసుకోవడంతో రక్తహీనత, జీర్ణక్రియ వంటివి లోపిస్తాయన్నారు. నులిపురుగులు నివారించుకుంటే ఎదుగుదల బాగుండి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సువర్ణమ్మ, సిహెచ్ఓ రాజశేఖర్, ఏఎన్ఎం సరస్వతి, ఆశా విజయమ్మ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం:మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారులు శ్రీనివాసులు రెడ్డి, అశోక్ కుమార్ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ ఖాదర్‌వలీ, ఎంపీడీఓ షాలెట్ లు పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణ దినోత్సవం పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి..విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:మండలంలోని చిరమన గ్రామ పంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నటువంటి అన్ని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ఐటిఐ కాలేజీలలో విద్యార్థిని విద్యార్థులకు, జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని వాటి ప్రాముఖ్యత గురించి సవివరంగా తెలియజేశారు. ఈ సంద ర్భంగా డాక్టర్లు మాట్లాడారు.కార్యక్రమంలో డాక్టర్ బి.జ్యోతి రాణి, కె.నాగ వినూత, షేక్ షఫీ, వి.సరోజ, సూపర్‌వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి:ప్రతి ఒక్కరూ డీ వార్మింగ్ పై అవగాహన కలిగి ఉండాలి సోమవారం డీ వార్మింగ్ డే సందర్భంగా నులిపురుగుల నివారణకు ఆయా పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని శివ కల్యాన్, ఎస్. వినీత, వైద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు:ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరులోని పడ్డిపాలెం రామానాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమ వారం జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని విద్యార్థులకు ఈ మాత్రలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయిని రూప్నీ రాణి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, గీతామాధురి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం:మండలంలోని కేజీబీవీ స్కూల్లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంలో జిల్లా మలేరియా అధికారి ఇ.హుస్సేనమ్మ, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్, డిఆర్డిఏ స్వప్న, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్, స్కూల్లో అవగాహనా ర్యాలీ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ మజీద్, రియాజ్, నౌషాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట:బోగోలు మండలం, కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఆధ్వర్యంలో బిట్రగుంట డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగులు నివారణకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్, పద్మావతి ,వైద్య సిబ్బంది కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

ఆక్రమించిన భూములను పేదల ఇళ్ల స్థలాలకు ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి:రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఈ విషయమై ధర్నా చేసి, ఆర్. డిఒ.ఎం సన్నీ వంశీ కృష్ణ ఆర్‌డిఒలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మల్లి మాట్లాడుతూ కావలి పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని, రియల్ ఎస్టేట్ వ్యాపారంచేసే వారు ఎక్కువుగా ఉన్నారన్నారు. సిజెఎఫ్ భూములు, మేత పోరంబోకులు , గుంటలు, గట్లు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకొంటున్నారని తెలిపారు. తద్వారా కోట్ల రూపాయలు గడిస్తున్నారని తెలిపారు. ఆక్రమించిన భూముల్లో ప్రభుత్వ సర్వే ప్రకారం కేశవులు నాయుడు భూముల్లో 60 ఎకరాలు ఉందని తెలిపారు. కాబట్టి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని, పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని తెలిపారు. ఈధర్నాలో జరుగుమల్లి విజయరత్నం, కత్తి ప్రభాకర్, చలంచర్ల లక్ష్మయ్య, పి శ్రీనివాసులు, భాస్కర్, అనేక మంది పేదలు పాల్గొన్నారు.

విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: విద్యార్థినులు లైంగిక దాడులపై పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని ఆత్మకూరు సిఐ గంగాధర్ పేర్కొన్నారు. ఆత్మకూరు బాలికోన్నతపాఠశాలలో సోమవారం విద్యార్థినులకు లైంగిక దాడులపై అవగాహన కల్పించి పలు జాగ్రత్తలు, సూచనలు అందచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పీ కె వేణుగోపాల్ సూచనలతో వారం రోజుల పాటు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థినులకు , ఉపాధ్యాయులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, సైడ్ స్వచ్ఛంధసంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, ఉపాధ్యాయురాలు వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

19,20తేదీల్లో బ్యాడ్మింటన్, టోర్నమెంట్ పోటీలు

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ :కీర్తిశేషులు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరు వైసిపి యువత ఆధ్వర్యంలో ఈ నెల 19 20 తేదిలలో ఆత్మకూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటిలు నిర్వహించనున్నట్లు నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటిలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.10,116, ట్రోఫీ, రెండవ బహుమతి రూ.7,116, ట్రోఫీ, మూడవ బహుమతి : రూ.5,116, ట్రోఫీ, నాల్గవ బహుమతి రూ.3,116 ట్రోఫీ బహూకరించనున్నట్లు తెలిపారు.

పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాని పూజలు

ప్రజాశక్తి-కావలి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఆరోగ్యం బాగా లేనందున ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆళహరిసుధాకర్ ఆదేశాల మేరకు కావలి నియోజక వర్గజనసేన నాయకులు, వీరమహిళలు జనసైనికులు కచ్చేరి మిట్టలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోసోమవారం విశేష పూజలు చేశారు.కార్యక్రమంలో కావలి నియోజక వర్గ కోఆర్డినేటర్ తిరుమలశెట్టి సుదీర్, ఐ.టి.కో- ఆర్డినేటర్ బాలు, 35 వ వార్డు ఇన్‌ఛార్జి పవన్ కుమార్, 32వ వార్డు ఇన్‌చార్జ్ బెల్లంకొండ మస్తాన్, పానీ, సాదు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములను కాపాడాలి

ప్రజాశక్తి-ఉలవపాడు:మండలంలో తీర ప్రాంతంలో కరేడు నిత్యం పచ్చని కారులతో ఉన్నటు వంటి వ్యవసాయ భూములను ప్రభుత్వం భారత్ పెట్రోలియం వారికి కట్టబెట్టేందుకు పెద్ద కుట్ర జరుగుతుందని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం. శ్రీనివాసులు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. చాప కింద నీరులాగా ప్రభుత్వం వారు భారత్ పెట్రోలియం వారికి వేల ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అలాంటి ప్రయత్నాన్ని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని తెలిపారు. కందుకూరు నియోజకవర్గం లో అతిపెద్ద మేజర్ పంచాయతీ కరేడు ఈ గ్రామంలో 16 కాలనీలో సుమారు 11,500 ఓటింగ్ తో నియోజకవర్గం గెలుపోటముల నిర్ణయించేటటువంటి శక్తి కలిగిన గ్రామాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కొన్ని వేల ఎకరాల్లో ఇక్కడ రైతులు వేరుశనగ పంటతో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తూ లక్షలాది రూపాయలు సంపాదించుకుంటూ వంటి రైతులకు ప్రభుత్వం ఇచ్చేటువంటి నష్టపరిహారం ఏ మూలకు సరిపోతుందన్నారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలి

నెల్లూరు రూరల్‌లో

కోవూరులో

అనంతసాగరంలో

ఆత్మకూరులో

ఇందుకూరుపేటలో



కొడవలూరులో

బిట్రగుంటలో

ప్రజాశక్తి-కోవూరు

రైతు పండించే ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కార్యాలయం ఎదుట జెండాలతో నిరసన చేపట్టి అనంతరం తహాశీల్దార్‌కు సిపిఎం నేతలతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా మూలె వెంగయ్య మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు వ్యవసాయంలో ఒక ఎకరాకి రూ.40వేలు ఖర్చు అవుతుందన్నారు. రైతు వద్ద 17వేల రూపాయలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. మండలంలో ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలుకూడా లేవన్నారు. రైస్ మిల్లర్ల వద్దనే డ్రైయర్లు, స్టీమ్ చేయగల టెక్నాలజీ ఉందన్నారు. ప్రభుత్వం మద్దతు రేటు కల్పించేందుకు మండలంలోని అన్ని ప్రాంతాల్లో అధికారులతో ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. ప్రతి పంచాయతీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గోతాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు రేటు కల్పించాలని రైతులు వేడుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్ గా రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయలను అదనంగా జతపరిచి రైతులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతుల వద్ద కనీస మద్దతు ధర కంటే 300 రూపాయలు తగ్గించి వ్యాపారస్తులు, దళారీలు కుమ్మక్కై, రైతు కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోగా కనీస మద్దతు ధర కూడా ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వాతావరణ పరిస్థితులు రీత్యా పంట పొలాలు దిగుబడి రాకుండా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా రైతుల పట్ల చిన్న చూపు తో వ్యవహరిస్తుందన్నారు. ఏదేమైనా రైతులపై ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతుకి మద్దతుగా ధాన్యం రేట్లు పెంచాలని కోరుతూ ఫిబ్రవరి 22వ తేదీ నెల్లూరులో జరిగే చలో నెల్లూరు కార్యక్రమంలో అందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, షేక్ అఫ్రోజ్, ఎస్‌కెబాబు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మారుబోయిన సుబ్బారావు, సర్దార్, యు.వి.రమణయ్య, చాన్ బాషా, హరి, గోవర్ధన్, కాలేషా, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు,

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర 19,720 రైతులకు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులి గండ్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించి తహాశీల్దార్‌కు, వ్యవసాయ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు క్వింటా ధాన్యం కి సుమారు 3000 రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం మాత్రం మద్దతు ధర తగ్గించడం విచారకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా కూడా మిల్లర్లు, దళారులు కుమ్మక్కై నాలుగు, ఐదు వేల రూపాయలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకే చివరి ధాన్యం గింజ వరకు రైతుల నుండి కొనుగోలు చేయాలన్నారు. రైతులను మోసం చేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో వరి కోతలు మొదలై వారం, పది రోజులు అవుతున్న ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదన్నారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఈనెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 22వ తేదీన నెల్లూరులో ఏ.బి.ఎం గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీకి, జిల్లాలోని రైతు సంఘాలు, రైతు నాయకులు, రైతులందరూ వేలాదిగా తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండవరపు శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, విస్సా మునిస్వామి, పోతంశెట్టి శ్రీనివాసులు, రేకులగుంట అంకయ్య, తంబి రమణయ్య, మద్దిశెట్టి సురేష్, బాల కోటయ్య, బిళ్లా రఘురామయ్య, జానకి రామయ్య, సిఐటియు నాయకులు చల్లుకొలుసు మల్లికార్జున, దత్త శ్రీ కోటయ్య,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు

ధాన్యం పండించిన రైతులకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలని , నెల్లూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ రైతు సంఘం నెల్లూరు రూరల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండల తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొ న్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, రైతు సంఘం నెల్లూరు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ నెల్లూరు మండలంలో మరి కొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కాబోతున్నాయన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల కు అమ్మి నష్టపోనివ్వ కుండా కొనుగోలు కేంద్రా లను వెంటనే ప్రారంభించాలన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరలకు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.చెంచయ్య, జి.సుధీర్, ఎడవల్లి రమణయ్య, శ్రీపతి వెంకయ్య, పర్చూరు ప్రభాకర్, శ్రీపతి దయాకరావు, అచ్చి .అనంతయ్య, అట్లా అనిల్, జి.వెంకటేశ్వర్లు, పేరిసెట్ల వెంకటరత్నం, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

రైతు పండించే ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఇందుకూరుపేట మండల సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కార్యాలయం ఎదుట జెండాలతో నిరసన చేపట్టి అనంతరం తాసిల్దార్ కష్ణ ప్రసాద్ కు సిపిఎం నేతలతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకి మద్దతుగా ధాన్యం రేట్లు పెంచాలని కోరుతూ ఫిబ్రవరి 22వ తేదీ నెల్లూరులో జరిగే చలో నెల్లూరు కార్యక్రమంలో అందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్ గా రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయలను అదనంగా జతపరిచి రైతులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతుల వద్ద కనీస మద్దతు ధర కంటే 300 రూపాయలు తగ్గించి వ్యాపారస్తులు, దళారీలు కుమ్మక్కై రైతు కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోగా కనీస మద్దతు ధర కూడా ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వాతావరణ పరిస్థితులు రీత్యా పంట పొలాలు దిగుబడిదాకా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా రైతుల పట్ల చిన్న చూపు తో వ్యవహరిస్తుందన్నారు. ఏది ఏమైనా రైతులపై ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రైతు సంఘం నాయకులు తిక్కవరపు సుధాకర్ రెడ్డి, వెన్ను వేణు, చీమకుర్తి రామిరెడ్డి, మనోహర్, నాయుడు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి-అనంతసాగరం

రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ మన జిల్లాలో వరికోతలు ప్రారంభం అవుతున్నాయన్నారు. ఈ నెల 22 న నెల్లూరు నగరం లో జరిగే రైతుల ప్రదర్శన, కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే మహా ధర్నా లో రైతులు,కౌలు రైతులు,వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్, వేము పెంచలయ్య, సత్తార్, దాదా మస్తాన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

దేశంలో కనీస మద్దతు ధర అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు లక్కు కృష్ణ ప్రసాద్, గంటా లక్ష్మీపతిలు అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ చుట్టుపక్కల రైతులు మద్దతు ధర కోసం సుదీర్ఘకాలం పోరాటాలు చేసినప్పటికీ మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. ఇది గత రెండు సంవత్సరాల క్రితం జరిగింది. జిల్లాలో 11 లక్షల ఎకరాలు సాగులో ఉందన్నారు.కొంతమంది మిత్రులు చెప్పినట్లు. ఒక్కొక్క చోట ఒక్కొక్క ప్రాంతంలో వరి కోతలు వచ్చేసి ఉన్నాయన్నారు. మార్చిలో పూర్తిస్థాయి వరి కోతలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ. పావనీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, ఏరియా కమిటీ కార్యదర్శి పోలిపోగు వెంకటేశ్వర్లు, మురుగళ్ల శాఖ కార్యదర్శి తోడేటి రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గొర్రె పర్తి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రాంతీయ కమిటీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. ధాన్యం మద్దతు ధర ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా సోమవారం బోగోలు సి,పి,ఎం ఆధ్వర్యంలో మండల తహాశీల్దార్ సురేష్ కు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.కార్యక్రమంలో బోగోలు మండల సిఐటియు మండల కార్యదర్శి బాదుల్లా, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, భాస్కర్ ,బ్రహ్మయ్య ,గడ్డం వెంకయ్య , రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు

రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేసి వినతి పత్రాన్ని డిప్యూటీ తహాశీల్దార్ సారంగపాణి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతులకు గిట్టుబాటు కావడం లేదని వ్యవసాయానికి పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. దీనికి అనుకూలంగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ డి మహమ్మద్ బాషా, చిట్టిబాబు, నరసింహ, దేవదానం, దేవ కుమారి, పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:మండల పరిధిలోని శ్రీ కొలను గ్రామపంచాయతీ లోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...అనుసముద్రంపేట మండలం పరిధిలోని శ్రీ కొలనులోని విద్యార్థులకు ఆన్లైన్ చీటింగ్ గురించి, రోడ్డు ప్రమాదాలు గురించి, అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ సంగం సర్కిల్ పరిధిలోని అన్ని స్కూళ్లలో చేస్తూ ఉన్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, మహిళ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి

ప్రజాశక్తి-కావలి: ఉపాధి హామీ పథకంకు నిధులు పెంచాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి కోరారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కావలి ఆర్. డి. ఓ. కార్యాలయంలో ఆర్. డి. ఓ. ఎం. సన్నీ వంశీ కృష్ణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రు. 8,6000 కోట్లు కేటాయించారని, అది ఏమాత్రం సరి పోవని, నిధులు ఇంకా పెంచాలని కోరారు. పథకానికి కనీసం 2.50లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్య. కా. సం. కావలి మండల కార్యదర్శి మారుపూడి రాధాకృష్ణ, కె. వి. పి. ఎస్. జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పై అవగాహన

ప్రజాశక్తి-కొడవలూరు :వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కావ్య చెప్పారు. ఆమె సోమవారంకొడవలూరు మండలంలోని యల్లాయపాలెం అంగన్‌వాడీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలనివ్యక్తిగత చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కోటేష్, పంచాయతీ సెక్రటరీ మాలాద్రి, ఆశా వర్కర్ వసంత తదితరులు పాల్గొన్నాం

మగ్గులు వితరణ

ప్రజాశక్తి-కోవూరు:కోవూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడైన వి. మల్లికార్జునరెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని తన సొంత నిధుల నుంచి ఆస్పత్రికి అవసరమైన బకెట్లు, మగ్గులు పంపిణీ చేశారు. ఇతరులకు స్ఫూర్తిదామకమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వీటిని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మల్లికార్జునరెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సు ప్రసూన లత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐగా రమాదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి :నూతన ఆర్‌ఐగా ఎస్. రమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఆమె భాద్యతలు స్వీకరించి మాట్లాడుతూ జలదంకి తహాశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులను నిర్వహిస్తూ ఇక్కడికి వచ్చామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ జి.సురేంద్ర రామాయపట్నం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కు కృషి చేస్తామన్నారు. అనంతరం తహాశీల్దార్ ఎం. సుభద్రను మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం

ప్రజాశక్తి-విడవలూరు: విద్యార్థుల ఆరోగ్యంపై విద్యారంగం శ్రీకారం చుట్టిందని పి ఆర్ ఆర్ అండ్ వీ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విడవలూరులో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ బి సుజాత ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఎంపీ హెచ్ ఏ హెల్త్ అసిస్టెంట్ చామంతి కళాశాలకు వచ్చి విద్యార్థిని విద్యార్థులకు నులు పురుగులు మందును పంపిణీ చేసి పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాల వారికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులు ఉన్నారు.

సాంకేతిక అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు:ప్రతి విద్యార్థి కేవలం పుస్తక జ్ఞానం సంపాదించుకుని దీంతో పాటు సాంకేతిక అంశాల పట్ల కూడా అధ్యయనం చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ పేర్కొన్నారు.మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అమర్ రాజా ఎనర్జీ మెబిలిటీ సంస్థ ఆధ్వర్యంలో క్వాలిటీ సర్కిల్పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సదస్సులను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని సాంకేతిక అంశాలను మరింత పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రావ్య, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు ఆందోళన

ప్రజాశక్తి-సంగం:స్థానిక ఆర్ ఎస్ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు.విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలకు తరలించడం పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహించారు. తరలించొద్దు,తరలించొద్దు మా పాఠశాలను తరలించొద్దు అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.మా పాఠశాలలో 34 మంది విద్యార్థుల ను వేరే పాఠశాలకు విలీనం చేయడం సరికాదని మండిపడ్డారు.మా పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పావని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న బ్యాంకు రుణాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు.బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో వివిధ బ్యాంకుల ద్వారా 52 యూనిట్లు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందాలనుకున్న వారు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచడం జరిగిందన్నారు. .

పేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలోని కావలి ఎడవల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ ముప్పూరి ధనమ్మ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో జ్వరం ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లార్వా, జ్వర పీడిత కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.జ్యోతి రాణి, ఇంకొక డాక్టరు కె నాగవినూత గ్రామస్తులతో మాట్లాడారు.ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, రాత్రి సమయాల్లో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశ వాలంటీర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పరిపూర్ణ రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కావలి: కావలిపట్టణానికి విసిరేసి నట్లున్న,రైల్వే ట్రాక్ కు పడమర ముసునూరు లో ఉన్న కస్తూర్బా బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో బాలికలకు 24 గంటలు పరిపూర్ణ రక్షణ కల్పించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. వారు మాట్లాడుతూ గత శుక్రవారం రాత్రి ఆడపిల్లలను వేధించి, భయభ్రాంతులకు గురిచేసిన దుస్సంఘటన మీడియా ద్వారా తెలుసుకుని సోమవారం సాయంత్రం , 5 గంటలకు కావలి ఉమెన్ ఫోర్స్ కస్తూర్బా స్కూల్ ను సందర్శించి జరిగిన దుర్ఘటనపై ప్రిన్సిపల్ సంధ్యారాణిని , ఉపాధ్యా యులు , సిబ్బంది , విద్యార్థులను విచారించారు.

గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సీతారామపురం

సొంత భూమి కలిగిన ప్రతి రైతూ గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని ఎఒ చెన్నారెడ్డి తెలిపారు.మండలంలోని వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం అని సూచించారు.

రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు.ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందన్నారు.

నోటీసు

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP. No. 44/2024 in OS. No. 142/2004

Between:

పాతూరి సామ్రాజ్యం (Died) వగైరా ...డి.హెచ్.ఆర్స్

Vs

గడ్డిపాటి లక్ష్మీ రాజ్యం (Died) వగైరా ...జె.డి.ఆర్స్

To.

2వ జె.డి.ఆర్.

గడ్డిపాటి దివిజ, D/o. లేటు వేణుగోపాలరావు,
నూకవరం గ్రామం, బడేవారిపాలెం పోస్టు,
వలేటివారిపాలెం మండలం, నెల్లూరు జిల్లా.

పై నెంబరు కేసులో మీకు నోటీసు నిమిత్తం వాయిదా తేది: 05-03-2025 కి ఉన్నది. కావున మీరు పై తేది అనగా తేది: 05-03-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషీ తెలియపరచుకొన వలసినది. లేని యడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయటమైనది.

// కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు 04-02-2025

అడుసుమల్లి రామయ్య
డి.హెచ్.ఆర్స్ తరపు న్యాయవాది
ఒంగోలు, సెల్: 9440390288